



లారీల నుంచి చెరుకు లోడు దించుతున్న కార్మికులు

పండుగ కళ

ఊపందుకున్న పొంగల్ వ్యాపారం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పసుపు కొమ్ములు



ముగ్గుపిండి సిద్ధం



పొంగల్‌కు సిద్ధమైన కొత్త కుండలు

ప్యారీస్, జనవరి 12: ఈ ఏడాది తొలి పెద్ద పండుగ సంక్రాంతికి రాజధాని నగరం చెన్నై ప్రత్యేక హంగులతో ముస్తాబవుతోంది. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే పొంగల్ కానుక పంపిణీతో ప్రజల్లో ఆనందాన్ని నింపగా, పండుగ రోజుల్లో సంప్రదాయ సాహస క్రీడ జల్లికట్టును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు మదురై, పుదుకోట సహా పలు జిల్లాల్లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు ప్రజలు కూడా పండుగను కోలాహలంగా జరుపుకొనేందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్లు, సంతలకు పోటెత్తుతున్నారు. చెన్నైలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన టినగర్, మైలాపూర్, అడయార్, పురుషవాక్కం తదితర ప్రాంతాల్లో పొంగల్‌కు సంబంధించిన సామగ్రి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పండుగ రద్దీలో చోరీలు సహా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రేటర్ చెన్నై పోలీసులు అన్ని ప్రాంతాల్లోను భద్రత కట్టుదిట్టం చేశారు. ఇక, కోయంబేడు హోల్ సేల్ మార్కెట్లో చెరకు గడలు, పండ్లు, రకరకాల పూలు, పసుపు కొమ్ములు, తోరణాలు తదితరాలు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి లారీల ద్వారా దిగుమతి అవుతున్నాయి. అలాగే, కోడంబాక్కం, నుంగంబాక్కం, మైలాపూర్, ఎగ్మూర్ సహా అన్ని వార్డుల్లో పొంగల్ కుండలను రంగులతో తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు. ఆదివారం జరుపుకోనున్న భోగి పండుగ రోజున వాయించే డప్పుల కొనుగోళ్లు కూడా ఊపందుకున్నాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ, కానుం పొంగల్ సంప్రదాయబద్ధంగా జరుపుకొనేందుకు రాష్ట్రప్రజలు సన్నద్ధమవుతున్నారు.

పెరిగిన చెరకు, కూరగాయల ధరలు...

కోయంబేడు హోల్ సేల్ సంతలో పొంగల్ సరుకుల ధరలు పెరిగాయి. చెరకు గడలు, పసుపు, అల్లం సహా కూరగాయల ధరలు గత ఏడాది కంటే ప్రస్తుతం రెండింతలు పెరిగాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.25కు విక్రయించిన బీన్స్ రూ.40కి పెరిగింది. కిలో మునక్కాయలు రూ.80కి, అల్లం రూ.110, 15 చెరకు గడల కట్ట రూ.500కు పెరిగాయి. అలాగే, పూలు, పండ్ల ధరలు కూడా పెరగడంపై కోయంబేడు మార్కెట్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సెంట్రల్ రైల్వేస్టేషన్

ఫిర్యాదుల స్వీకరణ కోసం హెల్ప్‌లైన్

ప్రభుత్వ రవాణా శాఖ నడిపే బస్సుల వివరాలను తెలుసుకునేందుకు వీలుగా 24 గంటల పాటు పనిచేసే హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం 94450 14450, 94450 14436 అనే నంబర్లతో హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేయగా, ప్రైవేటు బస్సులు అధిక ప్రయాణ చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేసేందుకు 1800 425 6151 044 లేదా 044- 2474 9002, 044 - 2628 0445, 044- 2628 1611 అనే నంబర్లను ప్రకటించింది.

1.25 లక్షల మంది రిజర్వేషన్

ఈ పండుగ కోసం తమ ఊర్లకు వెళ్ళేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల మంది ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నారు. వీరిలో ఒక్క చెన్నై నగరం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళేందుకు వీలుగా 85 వేల మంది రిజర్వేషన్ చేసుకోవడం గమనార్హం. అయితే, రిజర్వేషన్ చేసుకోని ప్రయాణికుల కోసం కిళంబాక్కంలోని కొత్త బస్టాండు నుంచి మరికొన్ని ప్రత్యేక బస్సులు నడిపేలా రవాణా శాఖ ఏర్పాట్లు చేసింది.

పల్లెకు పోదాం... చలో.. చలో

- సొంతూళ్లకు నగరవాసుల క్యూ
- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- 1.25 లక్షల మంది ముందస్తు రిజర్వేషన్
- 19,484 ప్రత్యేక బస్సులు

అడయార్, జనవరి 12: నగరవాసుల్లో సంక్రాంతి ఉత్సాహం ఉరకలేస్తోంది. ఈ పండుగను జరుపుకునేందుకు తమ సొంతూళ్లకు క్యూకట్టారు. ఫలితంగా అన్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికుల రద్దీ నెలకొంది. చెన్నై సెంట్రల్, ఎగ్మోర్, తాంబరం రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రిజర్వేషన్ కంపార్టుమెంట్లలో సైతం ప్రయాణికులు ఎక్కేశారు. ఇక అన్‌రిజర్వుడ్ కోచ్‌లో ఊపిరి పీల్చుకోలేనంత రద్దీ ఏర్పడింది. మరోవైపు, ఈ సంక్రాంతి పండుగకు తమ సొంతూళ్లకు వెళ్ళేందుకు 1.25 లక్షలమంది ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నారు. అదేవిధంగా రిజర్వేషన్ సౌకర్యంలేని ప్రయాణికుల వీలుగా తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థ 19,484 ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంది. ఈ బస్సులు వచ్చే మూడు రోజుల పాటు నగరం నుంచి వివిధ ప్రాంతాలకు వెళతాయి. ఇందుకోసం నగరంలో ఆరు బస్టాండ్లను ఏర్పాటు చేశారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకోని ప్రయాణికుల కోసం కిలాంబాక్కంలో ఇటీవల ప్రారంభించిన కొత్త బస్టాండు నుంచి బస్సులు బయలుదేరి వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి సెలవులకు తోడు శని, ఆదివారాలు కలిసి రావడంతో ఐదారు రోజుల పాటు సెలవులు వచ్చాయి. దీంతో నగరవాసులు తమ కుటుంబ సభ్యులతో సొంతూర్లకు శుక్రవారం రాత్రి నుంచే బయలుదేరి వెళ్లారు.



కిక్కిరిసిన కోయంబేడు బస్టాండు

కిక్కిరిసిపోయిన బస్టాండ్లు

సొంతూర్లకు వెళ్ళే ప్రయాణికుల రద్దీ కారణంగా అన్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేటు బస్సుల్లో కూడా తీవ్ర రద్దీ నెలకొంది. ప్రభుత్వ బస్సుల్లో రవాణా శాఖ నిర్ణయించిన ప్రయాణ చార్జీలనే వసూలు చేయగా, ప్రైవేటు బస్సుల్లో మాత్రం ఇష్టారాజ్యంగా వసూలు చేశారు. ఉదాహరణకు చెన్నై నుంచి తిరునెల్వేలికి సాధారణ డీలక్స్ బస్సుల్లో రూ.900 నుంచి రూ.2500 వరకు ప్రయాణ చార్జీని వసూలు చేశారు. అదే ప్రైవేటు బస్సుల్లో మాత్రం రెట్టింపు చార్జీలను వసూలు చేశారు.

మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడిపేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులోభాగంగా, శుక్రవారం చెన్నై నుంచి రోజువారీగా నడిపే 2100 బస్సులతో పాటు అదనంగా మరో 901 ప్రత్యేక బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లా కేంద్రాల నుంచి వివిధ ప్రాంతాలకు మరో 1986 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. చెన్నై నుంచి సొంతూర్లకు వెళ్లే ప్రయాణికుల కోసం కోయంబేడు, కేకేనగర్, తాంబరం, మాధవరం, పూందమల్లి, కిళంబాక్కం ప్రాంతాల్లో ఎక్కేలా ప్రత్యేక బస్టాండ్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే, సంక్రాంతి పండుగ ముగించుకుని నగరానికి తిరిగివచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నారు. రోజువారీగా నడిచే 2100 బస్సులతో 4830 ప్రత్యేక బస్సులను నడుపనున్నారు.



సీఎంతో వివిధ దేశాలకు చెందిన తమిళ విద్యార్థులు

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకోండి

ప్రవాస తమిళులకు సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఏ దేశంలో ఉన్నా మాతృభూమిని మరవకూడదని, ఆ దిశగానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో శుక్రవారం ఉదయం 'తమిళ్ వెల్లమ్' పేరుతో రెండు రోజుల ప్రవాస తమిళుల ఉత్సవాల ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. వివిధ దేశాల్లో ఉన్న తమిళులను కంటికి రెప్పలా కాపాడాలని, వారి బాగోగులు పట్టించుకోవాలనే తపనతోనే మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 2010లో 'ప్రవాస తమిళుల సంక్షేమ సంస్థ'ను నెలకొల్పుతూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఆ సంస్థను పట్టించుకోలేదన్నారు. మూడేళ్లుగా తమ ప్రభుత్వం దేశవిదేశాల్లో ఉన్న తమిళుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రవాస తమిళుల సంక్షేమంకోసమే ప్రత్యేకమంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 14 మంది సభ్యులతో ప్రవాస తమిళులు సంక్షేమ సంస్థ పని చేస్తోందన్నారు. విదేశాల్లో శాశ్వత పౌరసత్వం కలిగిన తమిళులు వారి పిల్లలకు తమిళభాష అభ్యసించడానికి ఈ సంస్థ పాటుపడుతుందన్నారు. విదేశాల్లో తప్పుడు కేసుల్లో అరెస్టయిన తమిళులను విడుదల చేయించడానికి ఈ సంస్థ రాయబార కార్యాలయాల స్థాయిలో చర్యలు చేపడుతుందన్నారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అనారోగ్యంపాలయ్యే వారికి చికిత్సలందించడానికి, వారిని స్వస్థలాలకు చేర్చేందుకు తమ ప్రభుత్వం కోటి రూపాయల దాకా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. విదేశాలకు వెళ్లే తమిళులకు అయా దేశాల్లో అమలులో ఉన్న చట్టాలు, బాధ్యతలపై శిక్షణ అందించటానికి తంజావూరు, పుదుకోట, రామనాథపురం, శివగంగ, కన్నియాకుమారి, పెరంబలూరు, విల్లుపురం జిల్లాల్లో ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉక్రెయిన్, సూడాన్, కంబోడియా, థాయ్‌లాండ్, మియన్మార్ వంటి దేశాల్లో ఉన్న తమిళులకు ఏవైనా సమస్యలు తలెత్తితే సకాలంలో స్వస్థలాలకు తరలిస్తోందన్నారు. అంతేకాకుండా యేటా జనవరి 12న ప్రవాస తమిళుల దినోత్సవం పాటిస్తున్నామన్నారు. రెండు రోజులుగా ప్రవాస తమిళుల ఉత్సవాలు ప్రపంచ తమిళుల మహానాడును తలపించేలా నిర్వహించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తమిళుల సంక్షేమమే ధ్యేయమని, ఆ దిశగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా వరద సాయంగా రూ.6వేలు, ప్రతినెలా గృహిణులకు కిచ్చే రూ.1000, వీటికి తోడుగా పొంగల్‌కానుకగా మరో రూ.1000 నెల రోజుల వ్యవధిలో పంపిణీ చేసిన తమ ప్రభుత్వంపై రాష్ట్ర మహిళా లోకం ప్రశంసల వర్షం కురిపించడం తనకు సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం పురోగమించగలదని చెప్పారు. జీవితపర్యంతమూ ప్రజాసేవే పరమావధిగా తాను రాష్ట్ర ప్రగతి కోసం పాడుపడుతానని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సెంజి మస్తాన్, సింగపూరు మంత్రి షణ్ముగం, మలేసియా మంత్రి కులశేఖరన్, శ్రీలంక ఈస్ట్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండైమాన్, మలేసియా మాజీ మంత్రి సుబ్రమణియన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో విశిష్టసేవలందించిన ప్రవాస తమిళ ప్రముఖులకు సేవా అవార్డులను ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

లోక్‌సభ ఎన్నికలకు టీఎన్‌సీసీ కొత్త వ్యూహం

కొత్త నియోజకవర్గాల్లో పోటీ! ● మరిన్ని సీట్ల కోసం డీఎంకేపై ఒత్తిడి?

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి రాష్ట్రం నుంచి పదికంటే ఎక్కువ సీట్లలో పోటీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు తమకు మరిన్ని సీట్లు కావాలని డీఎంకేపై ఒత్తిడి పెంచుతోంది. అంతేగాక ఇప్పటికే తమకు అనువైన నియోజకవర్గాల జాబితా సిద్ధం చేసింది. త్వరలోనే దీన్ని డీఎంకే అధిష్ఠానానికి అందజేయనుంది. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కు తిరువళ్లూరు, కృష్ణగిరి, ఆరణి, కరూరు, తిరుచ్చి, శివగంగ, తేని, విరుదునగర్, కన్నియాకుమారి నియోజకవర్గాలను డీఎంకే కేటాయించింది. ప్రస్తుతం డీఎంకే కరూరు, తిరుచ్చి, విరుదునగర్ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా కొద్ది నెలల గడువు మాత్రమే ఉండటంతో రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఏయే నియోజకవర్గాల్లో పోటీ చేయాలనే విషయంపై దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్రంలో ఈసారి కూడా డీఎంకే కూటమిలోనే కాంగ్రెస్ కొనసాగనుంది. ఈ రెండు పార్టీలు జాతీయ స్థాయిలో 'ఇండియా కూటమిలో' భాగస్వామ్య పార్టీలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలోని పార్టీలు వీలలైనంత త్వరగా కూటములను స్థిరపరచుకోవాలంటూ ఆ కూటమి నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలిపించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చర్చలు జరిపారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, సీఎల్పీ నేత సెల్వపెరుంతగై కూడా ఆ సమావేశంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో పార్టీకి కేటాయించిన సీట్ల వివరాలు, ఎన్ని సీట్లలో పార్టీ గెలిచిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఈసారి నియోజకవర్గాల మార్పులు చేర్పులపై కూడా అళగిరితో ఖర్గే ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్న నియోజకవర్గాలపైనా ఆరా తీశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీచేసి తేని మినహా ఎనిమిదింట్లో గెలిచింది. ఈసారి మరికొన్ని నియోజకవర్గాలను కేటాయించాలంటూ కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేపై ఒత్తిడి చేయనుంది. కూటమిలో కొత్త పార్టీలు చేరే అవకాశాలు అధికమైతే తొమ్మిది సీట్లకు తగ్గకుండా ప్రయత్నించాలని ఖర్గే రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సలహా ఇచ్చినట్లు సమాచారం. అదే సమయంలో గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన కొన్ని నియోజకవర్గాల్లో డీఎంకే పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తోంది. కూటమిలోని మిత్రపక్షాలు కూడా కాంగ్రెస్ పోటీ చేసి గెలిచిన సీట్లపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఈసారి కరూరు, తిరుచ్చి, విరుదునగర్ నియోజకవర్గాల్లో పోటీ చేయాలని డీఎంకే భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నియోజకవర్గాలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు కేటాయించాల్సిన సీట్ల ఎంపికపై డీఎంకే పరిశీలన జరుపుతోంది. నియోజకవర్గాల చేర్పులు, మార్పులు జరిగినప్పటికీ తిరునల్వేలి, తెన్‌కాశి, రామనాథపురం, తంజావూరు, మైలాడుదుర్తై, పెరంబలూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, ఈరోడ్ నియోజకవర్గాలను తప్పకుండా తమకు కేటాయించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు డీఎంకేపై ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ నియోజకవర్గాల జాబితాను టీఎన్‌సీసీ... పార్టీ హైకమాండ్‌కు పంపినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తిరునల్వేలి మేయర్‌కు తప్పిన పదవీగండం

● కౌన్సిలర్ల గైర్హాజర్‌తో వీగిన అవిశ్వాసతీర్మానం



మేయర్ శరవణన్

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ శరవణన్‌పై ఆ పార్టీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శుక్రవారం జరిగిన కార్పొరేషన్ ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లంతా మూకుమ్మడిగా గైర్హాజరవడంతో ఆయనకు పదవీగండం తప్పినట్లయింది. అరగంటసేపు కౌన్సిలర్ల రాకకోసం వేచి చూసిన కమిషనర్ రాక్రే శుభ జ్ఞానదేవ్ రామ్ చివరకు మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సభలో కోరం లేక వీగిపోయిందని ప్రకటించారు. దీంతో మేయర్ శరవణన్‌పై యేడాది వరకూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ఆస్కారం లేదని తెలిపారు. తిరునల్వేలి మేయర్‌గా శరవణన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఇప్పటి దాకా సొంత పార్టీ కౌన్సిలర్లకు ఆయనకు మధ్య అభిప్రాయభేదాలు తలెత్తుతూ వచ్చాయి. 55 మంది కౌన్సిలర్లు కలిగిన ఆ కార్పొరేషన్‌లో డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన కౌన్సిలర్లు 51 మంది దాకా ఉన్నారు. నలుగురు అన్నాడీఎంకే కౌన్సిలర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్‌లో 38 మంది కౌన్సిలర్లు మేయర్ శరవణన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిపేందుకు ప్రత్యేక సమావేశం జరుగుతుందని కమిషనర్ ప్రకటించారు. కీలకమైన ఈ సమావేశానికి 55 మంది కౌన్సిలర్లు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. ఇక మేయర్‌పై అవిశ్వాసతీర్మానం నెగ్గుతుందని, ఆయనకు పదవీ గండం తప్పదని అందరూ భావిస్తున్న సమయంలో రెండు రోజుల క్రితం డీఎంకే అధిష్ఠానం రంగంలోకి దిగింది. ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తంగం తెన్నరసు, జిల్లా శాఖ కార్యదర్శులు డీఎంకే కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. డీఎంకే మేయర్‌పై సొంతపార్టీ కౌన్సిలర్లే అవిశ్వాతీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి తొలగిస్తే పార్టీ ప్రతిష్ట దిగజారుతుందని కౌన్సిలర్లకు మంత్రి తంగం తెన్నరసు హితవు పలికారు. శుక్రవారం జరగనున్న కార్పొరేషన్ ప్రత్యేక సమావేశానికి ఎవరూ హాజరు కాకుడదని ఆదేశించారు. ఆ తర్వాత కౌన్సిలర్లందరూ వివిధ జట్లుగా ఏర్పడి విహారయాత్రలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 11 గంటలకు కార్పొరేషన్ ప్రత్యేక సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై ప్రసంగం, ఓటింగ్ జరగాల్సి ఉండగా కౌన్సిలర్లు హాజరుకాలేదు. అన్నాడీఎంకే కౌన్సిలర్లు కూడా ఈ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో సమావేశంలో మేయర్, కమిషనర్ మాత్రమే పాల్గొన్నారు. స్థానిక సంస్థల చట్టం 1998 ప్రకారం తిరునల్వేలి కార్పొరేషన్‌లో అవిశ్వాస తీర్మానం గెలవాలంటే ఈ సమావేశానికి 44 మంది కౌన్సిలర్లు తప్పకుండా హాజరుకావాల్సి ఉంది. అయితే శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ కౌన్సిలర్లెవరూ రాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగినట్లు కమిషనర్ ప్రకటించారు.

సమాచార దర్శిని

అడ్వొకెట్ జనరల్‌గా పీఎస్ రామన్



చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అడ్వొకెట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది పీఎస్ రామన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ పదవిలో ఉన్న ఆర్.షణ్ముగ సుందరం రెండు రోజుల క్రితం రాజీనామా చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో పీఎస్ రామన్‌ను అడ్వొకెట్ జనగల్‌గా నియమించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ రామన్ సుమారు మూడు దశాబ్దాల పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ పలు కీలక కేసులు వాదించి విజయం సాధించారు.

మెట్రోరైలు సేవల్లో మార్పు

ప్యారీస్, జనవరి 12: పొంగల్ పండుగను పురస్కరించుకొని చెన్నైలో మెట్రో రైలు సేవలను మార్పు చేసినట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ నెల 15, 16, 17 పండుగ రోజుల్లో ఆదివారం టైంటేబుల్ ప్రకారం మెట్రోరైలు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని శుక్రవారం సీఎంఆర్ఎల్ తెలిపింది.

ఎగ్మూర్ - నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక వందే భారత్ రైళ్లు

పెరంబూర్, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగ్మూర్-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక వందే భారత్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06081 చెన్నై ఎగ్మూర్ - నాగర్‌కోయిల్ ప్రత్యేక వందే భారత్ రైలు ఈనెల 13, 14 తేదీల్లో ఎగ్మూర్‌లో ఉదయం 5 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.45 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. అలాగే, నెం.06082 నాగర్‌కోయిల్ - ఎగ్మూర్ ప్రత్యేక వందే భారత్ రైలు ఈ నెల 13, 14 తేదీల్లో నాగర్‌కోయిల్ నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరి రాత్రి 11.25 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

19 నుంచి అన్నాడీఎంకే బహిరంగ సభలు

ఐసిఎఫ్, జనవరి 12: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 19వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే కార్యాలయం పేర్కొంది. రాష్ట్రం సహా ఇతరరాష్ట్రాల్లోనూ ఈసభలు జరగనున్నాయి.ఆర్కే నగర్‌లో ఈనెల 19వతేది జరిగే బహిరంగ సభలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాల్గొననున్నారు. సభలు జరిగే ప్రాంతాల్లో, పాల్గొనే నేతల వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఆ పార్టీ కార్యాలయం తెలిపింది.

17న ఎంజీఆర్ విగ్రహానికి ఎడప్పాడి నివాళి...

అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ 107వ జయంతి సందర్భంగా ఈనెల 17న ఆయన విగ్రహానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పూలమాల వేసి నివాళి అర్పించనున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎంజీఆర్ విగ్రహానికి ఈపీఎస్ పూలమాల వేసి నివాళి అర్పించి, పార్టీ పతకాన్ని ఎగురవేసి, కార్యకర్తలు మిఠాయిలు పంచనున్నట్లు పార్టీ తెలియజేసింది.

27నుంచి సెమిస్టర్ పరీక్షలు

ఐసిఎఫ్, జనవరి 12: ఈ ఏడాది సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27వ తేదీన ప్రారంభం కానున్నట్లు తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. మార్చి 23వ తేదీ వరకు శని, ఆదివారాల్లో పరీక్షలు జరుగుతాయని, అన్ని జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు వారం రోజుల ముందు హాల్ టిక్కెట్ విడుదల చేస్తామన్నారు. ప్రాక్టికల్ పరీక్షకు ప్రత్యేక హాల్‌టిక్కెట్ ఆన్‌లైన్ ద్వారా అందిస్తామని, టైంటేబుల్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

'ఎక్స్' పేజీలోనూ పరీక్షా సమాచారం

ఐసిఎఫ్, జనవరి 12: ఎక్స్ పేజీలోనూ పరీక్షలకు సంబంధించిన సమాచారం విడుదల చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న పోస్టులను పరీక్షల ద్వారా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షలు, ఖాళీ పోస్టుల వివరాలు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదలవుతుంటాయి.ఈ నేపథ్యంలో టీఎన్‌పీఎస్సీ అధికార పూర్వక ఎక్స్ ఖాతా 'టీఎన్‌పీఎస్సీ-ఆఫీస్' పేరుతో ప్రారంభించారు. ఇకపై ఎంపిక కమిషన్ విడుదల చేసే పరీక్షల వివరాలు ఎక్స్‌లో చూడవచ్చని కమిషన్ కార్యదర్శి గోపాల సుందర రాజ్ తెలిపారు.

చెన్నై పోలీసు శాఖలో ఎన్నికల విభాగం

ఐసిఎఫ్, జనవరి 12: రాబోయే లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని చెన్నై పోలీసు శాఖలో ఎన్నికల విభాగం ఏర్పాటైంది. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో జాతీయ ఎన్నికల కమిషన్ విధానాల మేరకు చెన్నై పోలీస్ కమిషనర్ ఉత్తర్వులతో ఈనెల 5వ తేది నుంచి స్థానిక వెప్పేరిలో ఉన్న కమిషనరేట్‌లో ఎన్నికల విభాగం ఏర్పాటైంది. ఈ విభాగంలో డిప్యూటీ, సహాయ కమిషనర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐ, కానిస్టేబుళ్లు అని మొత్తం 50 మంది నియమితులయ్యారు. మరో ఆ మండల ఎన్నికల విభాగాలు, 12 పోలీసు జిల్లా ఎన్నికల విభాగాలు ఏర్పాటయ్యాయి.

వరద సాయం అంశం రాష్ట్రప్రభుత్వం చూసుకుంటుంది

● సుప్రీంకోర్టు

అడయార్, జనవరి 12: గత యేడాది ఆఖరులో చెన్నై నగరాన్ని అతలాకుతలం చేసిన మిచౌంగ్ తుపాను వల్ల ఏర్పడిన నష్టానికి కేంద్రం నుంచి వరదసాయం పొందే అంశం రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ తుపాను వల్ల ఏర్పడిన నష్టాన్ని భర్తీ చేసేందుకు, వరద బాధితులను ఆదుకునేందుకు వీలుగా రూ.8 వేల కోట్ల నిధులు ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణ జరిపిన న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా,దిబంగర్ దత్తాతో కూడిన ధర్మాసనం... 'ఇది పాలనకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని వ్యాఖ్యానించింది. దీంతో పిటిషనర్ ఈపిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులకు అస్వస్థత

● అమ్మోనియా గ్యాస్ లీకైందా?

అడయార్, జనవరి 12: స్థానిక కందన్‌చావడిలోని ఒక ప్రైవేటు బ్యాంకులో పనిచేసే ఉద్యోగుల్లో 17 మంది తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వీరందరికీ శ్వాసపీల్చడంలో సమస్య ఉత్పన్నం కావడంతో కొద్దిసేపు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. ఆ వెంటనే వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో వారు కోలుకున్నారు. ఈ బ్యాంకులో గురువారం సాయంత్రం ఈ పరిస్థితి ఏర్పడింది. ఏదేని అగ్నిప్రమాదం సంభవించినపుడు మంటలను ఆర్పి వేసేందుకు ఉపయోగించే అమ్మోనియా గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమై ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పెరియార్ వర్సిటీలో రాత్రంతా తనిఖీలు

కీలకమైన దస్తావేజుల స్వాధీనం ● పోలీసుల తనిఖీలతో ఉద్రిక్తం

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సేలం పెరియార్ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ జగన్నాథన్ ఓ ప్రైవేటు సంస్థను నెలకొల్పి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసు విచారణలో భాగంగా పోలీసులు ఆ వర్సిటీలో గంటల తరబడి తనిఖీలు నిర్వహించారు. ఆ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'బూటర్ ఫౌండేషన్' అనే పేరుతో ప్రైవేటు సంస్థ ఏర్పాటైంది. ఆ సంస్థకు సంబంధించి వీసీ అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో ఆ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ జగన్నాథన్‌ను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆయన బెయిలుపై విడుదలయ్యారు. ఆ అవినీతి కేసుతో సంబంధం ఉన్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ తంగవేల్ సహా ముగ్గురు పరారయ్యారు. వారి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా పెరియార్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని వైస్‌ఛాన్సలర్ కార్యాలయం సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. గత వారం వర్సిటీలో పనిచేస్తున్న నలుగురు ప్రొఫెసర్లు, గెస్ట్‌హౌస్‌లో పనిచేసే తాత్కాలిక ఉద్యోగికి కరుప్పూరు పోలీసులు విచారణకు రమ్మంటూ సమన్లు జారీ చేశారు. దీంతో ఆ ఐగుగురు పోలీసుల ఎదుట హాజరై వాంగ్మూలాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం పెరియార్ వర్సిటీకి వెళ్ళిన గవర్నర్ ఆర్ఎన్ రవి... అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్నాథన్‌తో సమావేశం కావటం వివాదాస్పదంగా మారింది. వీసీపై నమోదైన కేసుల వివరాలను కూడా గవర్నర్ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సుమారు 25 నిమిషాల పాటు ఇరువురూ సమావేశమయ్యారు. ఆ తర్వాత గవర్నర్ కోయంబత్తూరుకు బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఉదయం 9గంటలకు కరుప్పూరు అసిస్టెంట్ పోలీసు కమిషనర్ నిలవళగన్ నాయకత్వంలో ఆరుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 30 మంది పోలీసులు పెరియార్ విశ్వవిద్యాలయంలో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. గవర్నర్ ఆ వర్సిటీలో వీసీతో భేటి అయిన సమయంలో కూడా ఈ తనిఖీలు కొనసాగాయి. వర్సిటీలోని వీసీ కార్యాలయం, సిండికేట్ కార్యాలయం, తమిళశాఖ కార్యాలయం, దస్తావేజులు భద్రపరిచే గది తదితర గదులలో సోదాలు జరిపారు. ఆ సందర్భంగా కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలు రాత్రి 12 గంటల వరకూ కొనసాగాయి. ఓ వైపు గవర్నర్ రాకను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించడం, అదే సమయంలో భారీ భద్రత మధ్య గవర్నర్ ఆ విశ్వవిద్యాలయానికి విచ్చేయడం, అదే సమయాన ఆ వర్సిటీలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు జరపడంతో ఆ ప్రాంతమంతటా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



పెరియార్ వర్సిటీలోని ఓ విభాగంలో తనిఖీ జరుపుతున్న పోలీసు ఉన్నతాధికారి

పోటెత్తిన తిరుమంగళం, సెంజి సంతలు

● రూ.8కోట్లకు మేకలు, పొట్టేళ్ల విక్రయం



సెంజి సంతలో మేకలను విక్రయిస్తున్న వ్యాపారులు



మదురై జిల్లా తిరుమంగళం సంతప్రాంతంలో గుమికూడిన జనం

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతికి ముందు భోగి పండుగను, మరుసటి రోజు కనుమ పండుగను మాంసాహార వంటకాలతో జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లోనే కాకుండా విల్లుపురం, మదురై జిల్లాల వారపు సంతల్లో పోటీ పడి మేకలు, పొట్టేళ్లు, కోళ్లను కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం మదురై జిల్లా తిరుమంగళం వారపు సంత, విల్లుపురం జిల్లా సెంజి వారపు సంతలో వేకువజామునే మేకలు, పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. శుక్రవారం వేకువజాము రెండు సంతలు ప్రారంభమైన రెండు, మూడు గంటలకే సుమారు రూ.5 కోట్ల విలువైన మేకలు, పొట్టేళ్లు, కోళ్ళను విక్రయించారు. మదురై జిల్లా తిరుమంగళం వద్ద ప్రతి శుక్రవారం మేకల సంతను జరపడం ఆనవాయితీ. రాష్ట్రంలో పొల్లాచ్చి తర్వాత భారీ యెత్తున నిర్వహించే సంతగా తిరుమంగళం సంతగా ఖ్యాతి గడించింది. దక్షిణాది జిల్లాలైన మదురై, విరుదునగర్, రామనాథపురం, శివగంగ, కోవిల్‌పట్టి, తిరునల్వేలి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఈ సంతకు తాము పెంచిన మేకలు, పొట్టేళ్ళ, కోళ్ళను విక్రయిస్తుంటారు. శుక్రవారం వేకువజాము 4 గంటలనుంచి 9 వరకు ఈ సంత కొనసాగుతుంది. ఈ సంతలో మేకల ధరలు వాటి బరువును బట్టి వ్యాపారులు నిర్ణయించారు. ఆ మేరకు ఒక్కో మేక రూ.13వేల నుంచి రూ.35వేల ధరలకు విక్రయించారు.

సెంజి సంతలో రూ.3కోట్లకు అమ్మకాలు...

ఇదే విధంగా విల్లుపురం జిల్లా సెంజి వద్ద శుక్రవారం నిర్వహించిన వారపు సంతలో రూ.3 కోట్లకు పైగా మేకలు, పొట్టేళ్లు, కోళ్లను విక్రయించారు. 150 సంవత్సరాలుగా సెంజి సంతను క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ సంతలో మేకలు, పొట్టేళ్లను కొనేందుకు తేని, కంభం, సేలం, కృష్ణగిరి, వేలూరు, తిరువణ్ణామలై, కడలూరు జిల్లాల నుంచే కాకుండా పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి వ్యాపారులు తరలివస్తుంటారు. శుక్రవారం వేకువజాము మూడు గంటలకే ఈ సంత మైదానానికి వేల సంఖ్యలో వ్యాపారులు తరలివచ్చారు. ఈ సంతలో మేకలను రూ.7వేల నుంచి రూ.12 వేలకు విక్రయించారు.

39 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జుల నియామకం



రూబీ మనోహరన్ - హసన్ మౌలానా

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంలోని 39 స్థానాలకు కాంగ్రెస్ అధిస్టానం పార్టీ ఇన్‌ఛార్జులను నియమించింది. తెన్‌కాశి లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహర్, తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గానికి హసన్ మౌలానా నియమితులయ్యారు. ఇదేవిధంగా చెన్నై నార్త్‌కు ఎస్.ఎం.హిదయతుల్లా, చెన్నై సౌత్‌కు డి.సెల్వం, చెన్నై సెంట్రల్‌కు లక్ష్మీరామచంద్రన్, శ్రీపెరుంబుదూరుకు టి.ఎన్.మురుగానందం, కాంచీపురానికి కె.తనికాచలం, అరక్కోణంకు పి.జేమ్స్, వేలూరుకు ఎం.వసంత్‌రాజ్, కృష్ణగిరికి మోహన్‌కుమార్ మంగళం, ధర్మపురికి ఏకాంబరం నియమితులయ్యారు. ఇక తిరువణ్ణామలైకి ఏ.జి.చిదంబరం, ఆరణికి ఇమయ కక్కన్, విల్లుపురానికి అరుళ్ అన్బరసు, కళ్లకుర్చికి బి.దామోదరన్, సేలంకు డాక్టర్ ఆర్.చెళియన్, నామక్కల్‌కు అళగు జయపాల్, ఈరోడ్‌కు ఎం.కందసామి, తిరుపత్తూరుకు ఎల్.ముద్దుకుమార్, నీలగిరికి పీ.ఎస్.శరవణకుమార్, కోయంబత్తూరుకు కోశి బాబీ, పొల్లాచ్చికి కె.సెంథిల్‌కుమార్, దిండుగల్‌కు పి.వరదరాజన్, కరూరుకు ఆర్.ఎం.పళనిస్వామి, తిరుచ్చికి బెన్నెట్ ఆంటోని రాజ్, పెరంబలూరుకు ఎస్.సుజాత, కడలూరుకు డాక్టర్ మణిరత్నం, చిదంబరం నియోజకవర్గానికి రంగా భూపతి, మైలాడుదురైకి జి.రాజేంద్రన్, నాగపట్టినంకు కనివన్నన్ నియమితులయ్యారు. తంజావూరుకు జాన్ అశోకన్, శివగంగకు అరుళ్ పిచ్చై, మదురైకి మహమ్మద్ సిద్దిక్, తేనికి జయసింహ నాచ్చియప్పన్, విరుదునగర్‌కు ఊర్వశి అమృత్‌రాజ్, రామనాథపురానికి స్వర్ణసేతురామన్, తూత్తుకుడికి కామరాజ్, తిరునల్వేలికి సి.రాబర్ట్ బ్రూస్, కన్నియాకుమారికి ఎస్.రాజ్‌కుమార్ పార్టీ ఇన్‌ఛార్జులుగా నియమితులయ్యారు.

కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పొంగల్ వేడుకలు



పొంగల్ వేడుకల్లో కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

వేలూరు, జనవరి 12: స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొల్యూషన్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొంగల్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ కుమారవేల్ పాండ్యన్, అన్ని శాఖల ఉద్యోగులు కలసి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ శాఖ సహా పలు శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు కలెక్టర్ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో పొంగల్ వేడుకలు



పొంగల్ తయారీలో కళాశాల సెక్రటరీ మణినాథన్

వేలూరు, జనవరి 12: స్థానిక సాయినాథపురంలో ఉన్న ధనభాగ్యం కృష్ణస్వామి మొదలియార్ మహిళా కళాశాలలో శుక్రవారం పొంగల్ వేడుకలు జరిగాయి. కళాశాల సెక్రటరీ మణినాథన్ అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో, కొత్త కుండల్లో పొంగళ్లు ఉంచి, ఆవులకు పూజలు చేసి, పారంపర్య క్రీడల్లో విద్యార్థులను ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే, సిలంబాట్టం, గరగాట్టం, కుమ్మిఆట్టం తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్, లెక్చరర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుమార్తె స్మారకార్థం... రూ.4 కోట్ల విలువైన స్థలం దానం

అడయార్, జనవరి 12: తన కుమార్తె స్మారకార్థం ఓ మహిళ తనకు సొంతమైన రూ.4 విలువైన స్థలాన్ని దానంగా ఇచ్చారు. మదురైకు సమీపంలోని యానైమలై కొడికులం ప్రభుత్వ పాఠశాల స్థాయిని పెంచేందుకు వీలుగా ఈ స్థలాన్ని ఆమె విరాళంగా ఇచ్చారు. ఆమె పేరు పూరణం (51). మదురై సర్వేయర్ కాలనీకి చెందిన ఉగ్రపాండి భార్య ఆయి (51). మృతి చెందిన తన కుమార్తె జనని స్మారకార్థం ఈ స్థలాన్ని దానంగా ఇచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్తర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ ప్రమాదంలో తమిళవాసికి గాయాలు

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 14వ మలుపు వద్ద మరో ప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన లోకేశ్వరి తన భర్తతో కలిసి దర్శనానికి వచ్చారు. దర్శనం ముగించుకుని శుక్రవారం మధ్యాహ్నం తమ ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. 14వ మలుపు వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లోకేశ్వరి తీవ్రంగా గాయపడింది. ఆమెను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. తిరుమల ఘాట్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన దాసరి జ్యోతి మహి(15) తీవ్రగా గాయపడగా వెంటనే తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు.

నరువి ఆసుపత్రిలో పొంగల్ సంబరాలు



పొంగళ్లు పెడుతున్న ఆసుపత్రి వ్యవస్థాపకుడు జీవీ సంపత్

వేలూరు, జనవరి 12: స్థానిక నరువి ఆసుపత్రిలో శుక్రవారం సమత్తువ పొంగల్ సంబరాలు నిర్వహించారు. ఆసుపత్రి స్థాపకుడు జీవీ సంపత్ అధ్యక్షతన పొంగళ్లు పెట్టారు. ఆసుపత్రి ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ సంపత్ మాట్లాడుతూ... జాతి, మత బేధాలు లేకుండా అందరూ జరుపుకొనే పండుగ పొంగల్ అన్నారు. సంబరాల్లో భాగంగా ఉద్యోగులు, నర్సులకు తాడు లాగే పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అనిత సంపత్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పాల్‌హెన్రీ, వైద్యసేవల అధ్యక్షుడు డాక్టర్ అరవిందన్ నాయర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాకబ్ జోస్, వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ దిలీప్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీజీపీ రాజేష్ అప్పీలు పిటిషన్ వాయిదా

ప్యారీస్, జనవరి 12: మహిళా పోలీసు అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో, మాజీ డీజీపీ రాజేష్‌దాస్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదా పడింది. 2021లో అప్పటి ముఖ్యమంత్రి సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన మహిళా ఎస్పీపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రిటైర్డ్ ప్రత్యేక డీజీపీ రాజేష్‌దాస్, ఆ సమయంలో చెంగల్పట్టు జిల్లా ఎస్పీగా పనిచేసిన కన్నన్‌పై సీబీసీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన విల్లుపురం కోర్టు గత ఏడాది జూన్ 16వ తేది తీర్పు వెలువరించింది. అందులో... రాజేష్‌దాస్‌కు రెండు సెక్షన్ల కింద తలా మూడేళ్ల జైలుశిక్ష, ఎస్పీ కన్నన్‌కు ఒక సెక్షన్ కింద రూ.500 జరిమానా మాత్రమే విధించింది. తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాజేష్‌దాస్ దాఖల చేసిన అప్పీలు పిటిషన్ ఈ నెల 18వ తేది విచారణ జరపనున్నట్లు విల్లుపురం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఆర్.పూర్ణిమ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ మహిళా పాఠశాలలో స్వచ్ఛభారత్



పారిశుధ్య పనుల్లో కార్పొరేషన్ సిబ్బంది

వేలూరు, జనవరి 12: అన్ని పాఠశాలల్లో స్వచ్ఛభారత్ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా స్థానిక కాట్పాడి ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం సరళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వేలూరు కార్పొరేషన్ 1వ మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజ పాల్గొని, మాస్ క్లీనింగ్ పనులు ప్రారంభించారు. కార్పొరేషన్ పారిశుధ్య ఉద్యోగుల ప్రాంత సూపర్‌వైజర్ మదివానన్ నేతృత్వంలో సిబ్బంది, పాఠశాల ప్రాంగణంలోని చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిత్ర లోకనాథన్, చిత్ర మహేంద్రన్, జూనియర్ రెడ్‌క్రాస్ జిల్లా ఆర్గనైజర్ జనార్దనన్, పాఠశాల మేనేజింగ్ కమిటీ అధ్యక్షురాలు విమల తదితరులు పాల్గొన్నారు.



టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీరామపట్టాభిషేకంపై నృత్యప్రదర్శన నిర్వహించిన వీజీ ప్రణౌతిని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, మోహన్‌రావు, ఊరా లక్ష్మీనరసింహం, శ్రీనివాస్‌రెడ్డి, జయదేవరావు, మాలా శంకర్ తదితరులు

మరుదమలై ఘాట్‌రోడ్డులో చిరుత సంచారం



మరుదమలై ఘాట్ మూడో మలువు వద్ద నడచి వెళుతున్న చిరుత

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మరుదమలై మురుగన్ ఆలయానికి వెళ్లే ఘాట్‌లో చిరుత సంచరిస్తుండటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆలయానికి పొరుగు జిల్లాల నుంచి, అలాగే కేరళ రాష్ట్రం నుంచి కూడా భక్తులు వేలసంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం మార్గశిర మాసం తైపూసం వేడుకలతో భక్తుల రాక పెరిగింది. ముఖ్యంగా శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్పభక్తులు కూడా ఈ దివ్యక్షేత్రాన్ని దర్శిస్తారు. ఇటీవల మరుదమలై ఆలయ ప్రాంతం, ఘాట్ మార్గంలో అడవి మృగాల సంచారం అధికమైంది. ముఖ్యంగా ఏనుగులు ఈ రహదారిలో సంచరిస్తుండటం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 7గంటల భక్తుడు కారులో ఘాట్ నుంచి దిగుతుండగా మూడో మలుపు వద్ద చిరుత నడచి వెళుతుండడం చూశాడు. సెల్‌ఫోన్‌లో ఆ చిరుతను వీడియో తీశాడు. ఆ తర్వాత కొండదిగి అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లిచిరుత సంచారంపై సమాచారంఅందించాడు.అటవీ అధికారులు మూడో మలుపు ప్రాంతానికి వెళ్లి చిరుత కోసం గాలించారు. ఆ తర్వాత కొండమీదకు వెళ్ళి ఆలయ దర్శనం చేసుకుంటున్న భక్తులందరినీ అప్రమత్తం చేశారు.

జల్లికట్టు ఎద్దులు కుమ్మి ఇద్దరు యువకుల మృతి

ప్యారీస్, జనవరి 12: మదురై, పుదుకోట ప్రాంతాల్లో జల్లికట్టు ఎద్దులు కుమ్మి ఇద్దరు యువకులు మృతి చెందారు. పొంగల్ పండుగ సందర్భంగా ఈ రెండు ప్రాంతాల్లో జల్లికట్టు నిర్వహించేందుకు హైకోర్టు జారీచేసిన సూచనల మేరకు ఆయా జిల్లా యంత్రాంగాలు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాయి. కాగా, పోటీల్లో పాల్గొనే ఎద్దులకు ఈత, నడక తదితరాలపై వాటి యజమానులు శిక్షణ ఇస్తున్నారు. మదురై జిల్లా ఊమచ్చికుళం గ్రామంలో మరుద (19) అనే యువకుడు తన స్నేహితులతో కలసి ఎద్దును శిక్షణ కోసం తీసుకెళ్లిన సమయంలో ఊహించని విధంగా ఎద్దు అతన్ని కుమ్మింది. దీంతో తీవ్రగాయపడిన మరుదను తంజావూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక శుక్రవారం మృతిచెందాడు. అదే విధంగా ఎద్దు కుమ్మిన ఘటనలో పుదుకోటకు చెందిన కాశిరాజన్ (27) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

అంకిత్ తివారికి కోర్టులో ఊరట

అడయార్, జనవరి 12: ప్రభుత్వ వైద్యుడి వద్ద లంచం తీసుకుని పట్టుబడిన మదురై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారి అంకిత్ తివారిని రాష్ట్ర ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అంకిత్ తివారీ వద్ద విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఈడీ అధికారులు దిండిగల్ క్రైం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మేజిస్ట్రేట్ మోహన విచారణ జరిపి... అంకిత్ తివారి వద్ద ఈడీ అధికారులు విచారణ జరిపేందుకు అనుమతి నిరాకరిస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

వివేకానందుడికి ఘన నివాళి



సంక్షేమ సహాయాలు అందిస్తున్న కేంద్ర మంత్రి వీకే సింగ్

వేలూరు, జనవరి 12: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వివేకానందుడి జయంతి వేడుకలకు వీఐటీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి వీకేసింగ్ పాల్గొని వివేదానందుడికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ వేడుకల్లో కాత్యాయని, ఇళంగో, జగదీశన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... వేలూరు విమానాశ్రయ రన్‌వే చిన్నది కావడంతో పెద్ద విమానాలు నడిపేందుకు సాధ్యం కాదన్నారు. రన్‌వే విస్తరణపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల్లో ఉన్న టోల్‌గేట్లు మూసివేసి, ఇంటర్నెట్ ద్వారా టోల్ ఫీజులు వసూలుచేసే విధానం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. అనంతరం పలు శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కేంద్రమంత్రి సంక్షేమ సహాయాలు అందజేశారు.

మంత్రి సెంథిల్ బాలాజీకి మళ్లీ నిరాశ!

● మూడో సారి బెయిల్ పిటిషన్ తోసిపుచ్చిన సెషన్స్ కోర్టు

పెరంబూర్, జనవరి 12: మంత్రి సెంథిల్ బాలాజి బెయిలు పిటిషన్‌ను మూడో సారి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. చట్టవ్యతిరేక నగదు నిరోధక చట్టం కింద గత ఏడాది జూన్ 14వ తేది ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మంత్రి సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించింది. ఈ కేసులో బెయిలు కోరుతూ సెంథిల్ బాలాజి తరఫున రెండు సార్లు దాఖలు చేసిన పిటిషన్లను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, మూడో సారి దాఖలుచేసిన బెయిలు పిటిషన్‌ను న్యాయమూర్తి అల్లి విచారించగా, ఆయనకు బెయిలు ఇస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశముందని, అందువల్ల ఇవ్వరాదని ఈడీ తరఫున వాదించారు. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజి మూడో సారి దాఖలుచేసిన బెయిలు పిటిషన్ తోసిపుచ్చుతూ శుక్రవారం న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఈ కేసులో సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 15వ సారి ఈ నెల 22వ తేది వరకు కోర్టు పొడిగించిన విషయం తెలిసిందే.

సోదరుడు చనిపోయాడని తెలిసినా..

కన్నీటితోనే విధులు నిర్వహించిన మహిళ

అడయార్, జనవరి 12: తన సోదరుడు చనిపోయాడని తెలిసినప్పటికీ... ఓ రేషన్ షాపు మహిళా ఉద్యోగిని విలపిస్తూనే సంక్రాంతి నగదు పంపిణీ విధుల్లో నిమగ్నమయ్యారు. ఆమెను చూసిన ప్రతి ఒక్కరూ తమ సానుభూతిని తెలుపుతూ ఓదార్చారు. ఆ మహిళా ఉద్యోగిని పేరు లీమా (47). తిరునెల్వేలి జిల్లా తచ్చనల్లూరుకు చెందిన ఈమె... పాలయంకోట్ట సెయింట్ మార్క్ రోడ్డులో ఉన్న రేషన్ షాపులో పని చేస్తున్నారు. గురువారం ఈ షాపులో సంక్రాంతి నగదు పంపిణీ ప్రారంభించారు. డబ్బులు పంపిణీ చేస్తుండగా సోదరుడు చనిపోయినట్టు లీమాకు ఫోన్ చేసి చెప్పారు. ఈ వార్త వినగానే భోరున విలపిస్తూనే తన విధులను నిర్వహించారు.



చెన్నై సైదాపేట నియోజకవర్గం సెయింట్ థామస్ మౌంట్ సామాజిక కేంద్రంలో ఏర్పాటైన 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు

చిత్రజ్యోతి


'బ్లూస్టార్'లో అశోక్ సెల్వన్, కీర్తి పాండ్యన్

ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే చిత్రం 'బ్లూస్టార్'

● దర్శకుడు జయకుమార్

అశోక్ సెల్వన్, శాంతను భాగ్యరాజ్, పృథ్వీ పాండ్యరాజన్, కీర్తిపాండ్యన్, దివ్య దురైస్వామి, లిజిఆంటోని, ఇళంగో కుమారవేల్, భగవతి పెరుమాళ్ తదితరులు నటించిన 'బ్లూస్టార్' చిత్రం ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు జయకుమార్ అన్నారు. లెమన్ లీఫ్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానరుపై ఆర్.గణేశమూర్తి, జి.సౌందర్యతో కలిసి దర్శకుడు పా.రంజిత్ నీలం ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు జయకుమార్ మాట్లాడుతూ... 'దేశంలో క్రికెట్ ప్రతి ఒక్కరికీ ఇష్టమైన క్రీడగా మారింది. ఈ క్రీడను నేర్చుకునేందుకు చిన్నారులు అమితాసక్తిని చూపుతున్నారు. అరక్కోణం సమీపంలోని ఒక చిన్న గ్రామంలో నివసించే యువకుల జీవితాలు, వారి ఆటలు, ప్రేమ, స్నేహం, రాజకీయం, సుఖదుఃఖాలు ఇలా అన్ని అంశాలను జోడించి తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రంలో నటించే నటీనటులంతా నిజ జీవితంలో క్రికెట్ ప్రావీణ్యం ఉండటంతో సినిమాకు బరింత బలంగా మారింది. అరక్కోణం యాసలోనే మాటలుంటాయి. గోవింద్ వసంత్ సంగీతం. ఇప్పటికే ఆడియోకు మంచి స్పందన వచ్చింది. యూత్, ఫ్యామిలీస్ ఇలా అందరికీ నచ్చేలా ఈ సినిమాను వినోదభరితంగా ఉంటుంది. ఈ నెల 25న విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.


పదేళ్ళ తర్వాత 'దేశింగురాజా'కు సీక్వెల్

● హీరోగా విమల్


విమల్, రవిచంద్రన్, ఎళిల్

పదేళ్ల క్రితం విమల్ హీరోగా ఎస్.ఎళిల్ దర్శకత్వంలో వచ్చిన 'దేశింగురాజా'కు మూవీకి సీక్వెల్ రూపొందనుంది. ఈ చిత్రం తొలిభాగంలో విమల్ హీరోగా నటించగా రెండో భాగంలోనూ ఆయన్నే ఎంపిక చేశారు. ఇన్ఫినిటీ క్రియేషన్స్ బ్యానరుపై నిర్మాత పి.రవిచంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ రెండో భాగంలో ముఖ్య పాత్రను జనా పోషిస్తున్నారు. తెలుగు సూపర్‌హిట్ మూవీ 'రంగస్థలం'లో నటించిన పూజిత పొన్నాడ, మరో తెలుగు హీరోయిన్ హర్షిత కథానాయికలుగా నటించనున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ఎళిల్ మాట్లాడుతూ... 'వేర్వేరు జీవిత లక్ష్యాలతో కాలేజీలో చేరిన స్నేహితులు.. వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తుంటారు. వీరి జీవిత పయనం ఎలా సాగింది? వీరు ఎలాంటి పరిస్థితుల్లో ఎదుర్కొన్నారు? అన్నదే ఈ చిత్ర కథ. దీన్ని పూర్తి వినోద భరిత చిత్రంగా తెరకెక్కించనున్నారు. సాధారణంగా విమల్ - ఎళిల్ మూవీ అంటేనే హాస్యం ఉంటుంది. ఇపుడు ఈ కాంబోకు తోడు సూరి, యోగిబాబు, రవిమరియా, రోబో శంకర్, సింగంపులి, కింగ్‌స్లీ, పుగళ్, మొట్టై రాజేంద్రన్, వయ్యాపురి, లొల్లు సభా ఇలా అనేక మంది హాస్య నటులు నటిస్తున్నారు. ఎస్.ఎళిల్ చిత్రాల్లోని పాటలన్నీ మంచి ఆదరణ పొందాయి. ముఖ్యంగా ఎళిల్ - విద్యాసాగర్ కాంబినేషన్‌లో వచ్చిన 'పూవెల్లాం ఉన్ వాసమ్' చిత్రం పాటలు ఎంతటి ప్రజాదరణ పొందాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో ఈ సినిమాకు విద్యాసాగర్‌ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేశారు. ఆర్.సెల్వ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే ఈ చిత్రానికి ఎడిటింగ్ ఆనంద్ లింగా కుమార్, డ్యాన్స్ దినేష్, సహ నిర్మాత ఆర్.బాలకుమార్.

కోలీవుడ్‌కు ముందుగానే సంక్రాంతి


'కెప్టెన్ మిల్లర్'లో ధనుష్

కోలీవుడ్‌కు ముందుగానే సంక్రాంతి కళ వచ్చింది. పొంగల్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఐదు చిత్రాలు చిత్రాలు విడుదలకాగా, వీటిలో ఒక డబ్బింగ్ చిత్రం ఉంది. ధనుష్ - ప్రియాంక అరుళ్ మోహన్, అదితి బాలన్ నటించిన 'కెప్టెన్ మిల్లర్', శివకార్తికేయన్ - రకుల్ ప్రీత్‌సింగ్ నటించిన 'అయలాన్', విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ జంటగా నటించిన 'మెర్రీ క్రిస్మస్', అరుణ్ విజయ్, ఎమీ జాక్సన్, నిమిషా సజయన్ నటించిన 'మిషన్ చాప్టర్-1' సినిమాలున్నాయి. వీటితో పాటు తేజ సజ్జా, అమృత అయ్యర్, వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన 'హనుమాన్' చిత్రాన్ని తమిళ నేటివిటీకి తగినట్టుగా డబ్బింగ్ చేసి విడుదల చేశారు. దీంతో అన్ని థియేటర్ల వద్దా ఆయా హీరోల అభిమానుల కోలాహలం కనిపించింది. 'కెప్టెన్ మిల్లర్' చిత్రానికి మాత్రం ఐదు ఆటలు ప్రదర్శించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఉదయం 9 గంటలకే ఈ చిత్ర తొలి ఆట మొదలైంది. దీంతో ధనుష్ అభిమానులు థియేటర్ల వద్ద సందడి చేశారు. కటౌట్లకు పాలాభిషేకం చేసి డ్రమ్స్ వాయిస్తూ డ్యాన్స్ చేశారు. అలాగే, దేవికరుమారియమ్మన్ థియేటర్‌లో హీరో అరుణ్‌విజయ్ అభిమానులతో కలిసి సినిమా చూసి ఎంజాయ్ చేశారు. శివకార్తికేయన్ కూడా తన అభిమానులతో కలిసి చెన్నైలోని ఒక థియేటర్‌లో సినిమా చూశారు. రజనీకాంత్, కమల్ హాసన్, అజిత్, విజయ్, సూర్య, విక్రమ్ వంటి పెద్ద హీరోల చిత్రాలు ఈ సంక్రాంతికి విడుదలకాలేదు. రజనీకాంత్ అతిథి పాత్రను పోషించిన 'లాల్ సలామ్' చిత్రం పొంగల్‌కు విడుదల చేయాలని భావించినప్పటికీ చివరి నిమిషంలో వాయిదా వేశారు.


అవార్డు ప్రదానోత్సవ దృశ్యం

సమాజంలో సేవాతత్పరత పెరగాలి

● హైకోర్టు మాజీ జడ్జి ఎస్.కృష్ణన్

సమాజంలోని ప్రతి ఒక్కరిలో సేవాతత్పరత పెరగాలని, అప్పుడే ఇతరుల కష్టాల్లో మనం కూడా భాగస్వాములం కాగలమని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.కృష్ణన్ అన్నారు. మహా ఫైన్ ఆర్ట్స్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా బుల్లితెర, వెండితెర రంగాలకు చెందిన యువ నటీనటులను ఎంపిక చేసిన వారిని ప్రత్యేకంగా సన్మానించింది. ఈ కార్యక్రమం వడపళనిలోని శిఖరం హాలులో జరిగింది. ఇందులో మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని, పలువురు నటీనటులను సన్మానించి అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణన్ మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి ఒక్కరిలో సేవాగుణం పెరగాలని కోరారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ తమను తాము మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా టీవీ, సినిమా రంగాలకు చెందినవారు, సినిమాల్లో ఇచ్చే సందేశాలను ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహా ఫైన్ ఆర్ట్స్ ఫౌండర్ డాక్టర్ అనురాధా జయరామన్, సీనియర్ సినీ పీఆర్వో కలైమామణి నెల్లై సౌందర్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.

తిరువళ్లువర్ చిత్రంతో ఎస్‌కేపీసీ విద్యార్థినుల రికార్డు


తిరువళ్లువర్ చిత్రం ఆకారంలో మానవహారంగా నిల్చున్న 1,500 మందికి పైగా విద్యార్థినులు

ప్యారీస్, జనవరి 12: ప్రముఖ తమిళ కవి తిరువళ్లువర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నైలోని శ్రీ కన్యకా పరమేశ్వరి కళాశాల (ఎస్‌కేపీసీ) విద్యార్థినులు కలాం వరల్డ్ రికార్డు సాధించారు. శుక్రవారం ఉదయం కళాశాల ప్రాంగణంలో 108 అడుగుల పొడవు, 75 అడుగుల వెడల్పు పరిమాణంలో 1,500 మందికి పైగా విద్యార్థినులు తిరువళ్లువర్ చిత్రం ఆకారంలో మానవహారంగా నిల్చున్నారు. కలాం వరల్డ్ రికార్డ్ చైర్మన్ కుమరవేల్ బృందం ప్రపంచంలోనే తొలిసారి తిరువళ్లువర్ చిత్రాన్ని మానవహారంగా చేసి అరుదైన సాధనగా గుర్తించినట్లు వెల్లడించారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకొని, విద్యార్థినులను అభినందించారు.

కేసరి మహోన్నత పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు


వేడుకల్లో ప్రముఖులు

అడయార్, జనవరి 12: స్థానిక టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. నానాటికీ కనుమరుగైపోతున్న సంస్కృతి సంప్రదాయాలకు పునరుత్తేజం కలిగే విధంగా, అత్యంత శోభాయమానంగా ఈ వేడుకలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు రకరకాల రంగవల్లికలు వేసి తమలోని సృజనాత్మకను ప్రదర్శించారు. విద్యార్థులకు గ్రూపులుగా విభజించి ఈ ముగ్గుల పోటీలను నిర్వహించి, వాటిలో మొదటి మూడు స్థానాలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాఠశాల కార్యవర్గ సభ్యురాలు కె.సుభద్రాదేవి పాల్గొని విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో హెచ్‌ఎం నాగుల గోపాలయ్య చేసిన ప్రసంగంలో సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పేరుతో మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేశారు.

'రెఫెక్స్' ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు


రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రెఫెక్స్ సిబ్బంది

అడయార్, జనవరి 12: నగరంలోని రామకృష్ణ స్కూల్ సహకారంతో రెఫెక్స్ గ్రూపు 'రోడ్డు భద్రతా వారోత్సవా'లను నిర్వహించింది. దేశంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను జరుగుతున్నాయి. ఇందులోభాగంగా ఈ కంపెనీ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించింది. ఈనెల 11 టి.నగర్‌లోని బజుల్లా రోడ్డు కూడలిలో ఈ గ్రూపు కంపెనీకి చెందిన ఉద్యోగులు, సిబ్బంది, రామకృష్ణ స్కూల్ విద్యార్థులంతా కలిసి ఈ వారోత్సవాల్లో పాల్గొని, వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 2022లో కేంద్ర జాతీయ రహదారులు మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాల మేరకు దేశంలో రోడ్డు ప్రమాదాలు 9.4 శాతం మేరకు పెరిగినట్టు తెలిపింది. దాదాపుగా 1.68 లక్షల మంది ఈ రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలను కోల్పోయారని, ఇందులో పాల్గొన్న రెఫెక్స్ గ్రూపు ప్రతినిధులు వెల్లడించారు.

శుభ వీరపాండ్యన్‌కు పెరియార్ అవార్డు


శుభవీరపాండ్యన్ - సీపీఎం నేత పి.షణ్ముగం

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం 2023 సంవత్సరానికిగాను సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రముఖులకు ఇచ్చే పెరియార్ అవార్డును రాష్ట్ర సామాజిక న్యాయ అమలు నిఘా కమిటీ అధ్యక్షుడు శుభ వీరపాండ్యన్‌కు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. ఇదే విధంగా ఆదిద్రావిడుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీపీఎం నేత పి.షణ్ముగంకు డాక్టర్ అంబేడ్కర్ అవార్డును ప్రదానం చేయనుంది. శనివారం చెన్నైలో జరగనున్న ప్రత్యేక సభలో వీరిరువురికీ ముఖ్యమంత్రి స్టాలిన్ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డుల కింద రూ.5లక్షల నగదు, స్వర్ణపతకం, ప్రశంసాపత్రాన్ని అందిస్తారు.


నెమలి నృత్యం


నోటిని తీపి చేసుకుంటున్న విద్యార్థినులు




గరగాట్టం

ఉట్టిపడిన గ్రామీణ సంస్కృతి

ప్యారీస్, జనవరి 12: సంక్రాంతి పండుగ పుణ్యమా అని రాజధాని నగరంలో పల్లె వాతావరణం సంతరించుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో గ్రామీణ సంస్కృతికి అద్దం పడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి కోలాహలంగా సంబరాలు జరుపుకుంటున్నారు. ప్రాంగణాలను మామిడి, అరటి తోరణాలు, చెరకు గడలు, రంగవల్లికలతో తీర్చిదిద్దారు. విద్యార్థులు సంక్రాంతి పండుగను ఆహ్వానిస్తూ సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. సాహసక్రీడలు, విన్యాసాలు, జానపద పాటలకు అనుగుణంగా స్టెప్పులేసి అలరిస్తున్నారు. పల్లెల్లో ఆడే క్రీడల్ని సైతం ఆడుకుంటూ సరదాగా గడిపేస్తున్నారు. అడయార్‌లోని డాక్టర్ ఎంజీఆర్-జానకి మహిళా కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు శుక్రవారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. చిలుక జోస్యం, రాగి అంబలి, గ్రామీణ వస్తువుల విక్రయ సంత ఏర్పాటుచేశారు. అదే విధంగా చూలైలోని మహర్షి విద్యా మందిరంలో ప్రీ కేజీ నుంచి ప్లస్‌టూ వరకు చదువుకుంటున్న విద్యార్థులు సంక్రాంతి పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఎస్‌కేపీడీ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, రామకుమార్, సీనియర్ ప్రిన్సిపాల్ వినోల మౌళి, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అడ్మిన్ మేనేజర్ ఎ.శ్రీలత తదితరులు విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. మరోవైపు పుళల్ సెంట్రల్ కారాగారం, మహిళా జైలు ప్రాంగణాల్లో కూడా సంక్రాంతి సందడి నెలకొంది. ఖైదీలతో కొత్త కుండల్లో పొంగల్ వండించి సూర్య భగవానుడికి జైలు అధికారులు పూజలు చేయించారు. అనంతరం ఉట్టి కొట్టేందుకు మహిళా ఖైదీలు ఉత్సాహం చూపారు.






మహర్షి విద్యా మందిర్ విద్యార్థులతో నిర్వాహకులు - ఒంటెద్దు బండిపై విహరిస్తున్న చిన్నారులు - ఎంజీఆర్-జానకి కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినుల కేరింత

తెలుగు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు




ఎంబీఎస్ వివేకానంద తెలుగు పాఠశాలలో సంక్రాంతి వేడుకలు - టీజేఎస్ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పెరంబూర్, జనవరి 12: తిరువళ్లూర్ జిల్లా చోళవరం యూనియన్ ఆరణి పట్టణంలోని ఎంబీఎస్ వివేకానంద తెలుగు మెట్రిక్యులేషన్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ శాంతమ్మ భాస్కర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మన్ని అమరలింగం పాల్గొన్నారు. సంబారాల్లో భాగంగా విద్యార్థులు రంగవల్లికలు వేసి,మధ్యలో గొబ్బెమ్మలు పెట్టి, దాని చుట్టూ తిరుగుతూ నృత్యం చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీనాక్షి,ఉపాధ్యాయులు విజయ, మేనక, మీనా, రేవతి, బండ్ల శ్రీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీజేఎస్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో....

పెరువాయల్ గ్రామంలోని టీజేఎస్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో శుక్రవారం పొంగల్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీజేఎస్ విద్యా సంస్థల అధినేత, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్ హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఏలుమలై సమక్షంలో ఉపాధ్యాయులు పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.


సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఎస్ఆర్ఎం వర్శిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ పారివేందర్, ప్రోఛాన్సలర్ డా. రవి పచ్చముత్తు తదితరులు

ఎస్ఆర్ఎం వర్శిటీలో సంక్రాంతి సంబరాలు

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కాట్టాన్ కొళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం వేలాదిమంది విద్యార్థుల నడుమ సంక్రాంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ రవి పచ్చముత్తు, వీసీ డాక్టర్ సి.ముత్తమిళ్‌సెల్వన్, ప్రో వైస్‌చాన్సలర్లు ఎ.రవికుమార్, ఎ.వినయ్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.పొన్నుసామి తదితరులు తమిళ సంప్రదాయిక దుస్తులు ధరించి హాజరయ్యారు. ఉట్టి కొట్టి, పొంగళ్లు వండి, విద్యార్థినుల నృత్యాలు, ఆటలుపాటలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో ఓ చిన్న సైజు రోబో తమిళ పాటకు గెంతులు వేసి అందరినీ నవ్వించడం విశేషం. ఈ వేడుకల్లో వివిధ పోటీల్లో విజేతలకు డాక్టర్ మనిమంగై సత్యనారాయణన్ బహుమతులను ప్రదానం చేశారు.


చెన్నైలో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఈ నెల 14నుంచి బ్రెజిల్‌లో జరుగనున్న బధిర యువజన క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారులకు ప్రయాణ ఖర్చుల కోసం రూ.5లక్షల నగదును అందజేస్తున్న క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్

రేలా హాస్పిటల్‌లో అన్నవాహిక పగుళ్లకు అరుదైన చికిత్స

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలోని రేలా హాస్పిటల్‌లో అన్నవాహికలో పగుళ్లతో తీవ్ర అస్వస్థతకు గురైన మీరాన్ మొయుద్దీన్ (49)కు వైద్యనిపుణులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గత ఆదివారం ఉన్నట్టుండి ఆయన రక్తవాంతులు చేసుకుని ఆ ఆసుపత్రి అత్యవసర చికిత్సావిభాగంలో చేరారు. ఆయనకు వైద్య పరీక్షలు చేసినప్పుడు అన్నవాహికలో పగుళ్ల ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత డాక్టర్ పీయూష్ భవానే, డాక్టర్ ఆర్ రవి తదితరుల బృందం అన్నవాహిక రంధ్రాలను మూసివేసేలా ఎండోస్కోపీ జరిపి మెటల్ క్లిప్‌లను అమర్చే చికిత్సలు జరిపారు. ఈ చికిత్సలతో రోగి ఆరు రోజుల తర్వాత శుక్రవారం డిశ్చార్జీ అయినట్లు డాక్టర్ పీయూష్ భవానే తెలిపారు.


రాజ్‌భవన్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.